ప్లాస్టిక్ రహిత బీచ్‌గా తీర్చిదిద్దాలి : ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంతో సముద్రతీర ప్రాంతాలు కలుషితం అవుతున్నాయని, సముద్ర తీర ప్రాంతాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి , స్వచ్ఛత జన్ భాగీ దారి సాగరతీర స్వచ్ఛత ఇండియా జీ-20 ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో మెగా బీచ్ క్లీన్ అప్ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రామకృష్ణ బీచ్ నుండి వైఎంసిఏ వరకు "సాగరతీర స్వచ్ఛత " బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడులు, ప్రాథమిక వసతులు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల సాగర తీరం కలుషితం అవుతుందని, మన సాగర తీరాన్ని కలుషితం కాకుండా కాపాడుకోవాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థతో కలిసి బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సముద్ర తీరాన్ని శుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని అన్నారు. జిల్లా కలక్టర్ డా. ఎ. మల్లిఖార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల

మేరకు ఈ రోజు దేశంలోని సముద్ర తీరాలను శుభ్రపరచడం లో భాగంగా ఈ రోజు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తో కలిసి విశాఖ సాగరతీరం లో సాగర తీర స్వచ్ఛత కార్య క్రమాన్ని రామకృష్ణా బీచ్ నుండి నిర్వహిస్తున్నామని తెలిపారు. సాగర తీరం లో ఏవైనా ఉపయోగించిన తదుపరి వ్యర్థాలను జి వియం సి వారు ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ లలో పడవేయాలని సూచించారు. విశాఖ లో గత సంవత్సర కాలంగా సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని వివరించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.కాలుష్య నియంత్రణ మండలి సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల తీర ప్రాంతాలలో బీచ్ క్లీనప్ కార్యక్రమం ఈరోజు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ప్లాస్టిక్ పర్యావరణానికి ఎంతో హాని చేస్తుందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలని కోరారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ మాట్లాడుతూ సాగర తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరు కర్తవ్యం అని, విశాఖ పర్యాటక ప్రాంతం కాబట్టి ఎక్కువమంది పర్యాటకల్లు బీచ్ ను సందర్శించేందుకు వస్తున్నందున తీరప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సాగర తీర స్వచ్ఛత బీచ్ క్లీనింగ్ కార్యక్రమం పై కలెక్టర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం బీచ్ లో వివిధ సంస్థల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన ఎన్విరాన్మెంటల్ ఫ్రెండ్లీ స్టాల్స్ , స్యాండ్ ఆర్ట్ ను అతిధులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సీ.ఎం.సాయి కాంత్ వర్మ,డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ విద్యాసాగర్ నాయుడు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఈఈ పి ప్రసాద్, ఎస్ ఇ నాగార్జున, ఈ ఈ పి. శ్రీనివాసరావు. నేవీ, కోస్ట్ గార్డ్, విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యమనేత నాగేశ్వరావు సేవలు స్ఫూర్తిదాయకం : సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నం బ్యాంక్ కాలనీ అపార్ట్మెంట్ వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సీపీఐ, రైతు సంఘం ఉద్యమ నేత రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కొల్లి నాగేశ్వర రావు మూడవ వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పూలమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు అనంతరం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నిరంతరం రైతు వ్యవసాయ కార్మికులు పడుతున్న బాధలను చూసి ఎన్నో ఉద్యమ పోరాటాలు, అణగారిన కుటుంబాలకు సొంత భూములను పంచడం, పోలవరం ప్రాజెక్ట్ పోరాటాలతో కమ్యూనిస్టు సిద్ధాంతాలకు

కట్టుబడి ఎంతో మందికి స్ఫూర్తి దాయకంగా కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు గారి ఆశయాలతో రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర, పంట నష్టం, కౌలు రైతుల రుణాలు, అణగారిన కుటుంబాలకు బంజర, కొండ పోడు భూములకు సాగు చేసుకున్న భూములకు సాగుహక్కు కల్పించి పట్టాలి ఇవ్వాలని డిమాండ్‌తో రాష్ట్రంలో ఉన్న షుగర్ ఫ్యా క్టరీలు కార్మికులు, రైతులుకు బకాయిలు చెల్లించి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని నిరంతరం ఆయన ఆశయాలతో ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రాము నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురు బాబు, డిసిహెచ్ క్రాంతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శివ లంక కొండలరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లి రాజు మాణిక్యం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జీ.వణంద్ర, నర్సీపట్నం రూరల్ కార్యదర్శి నల్లబెల్లి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పంపిణీ చేసిన వస్తువులు నాణ్యత లేకపోతే సహించేది లేదు

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్

విశాలాంధ్ర - అనంతగిరి : మండలంలోని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదివారం పర్యటించారు. చిలకలగెడ్డ ఎంపీపీఎస్ పాఠశాల నాడు నేను పనులను పరిశీలించారు. మొదటి విడత లో పాఠశాల లో 1.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ ను పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏర్పాటు చేయడమే కాదని పర్యవేక్షణ బాధ్యత అధికారులపై ఉందని, ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి అధికారులపై మండిపడ్డారు. అనంతరం పాఠ్య పుస్తకాలను స్టాక్ రూమ్ ను పరిశీలించారు. విద్యా సంవత్సరంలో

పాఠ్యపుస్తకాలు లోటు లేకుండా విద్యార్థులకు అందజేయాలని, డీఈవో ఎంఈఓ సూచించారు. విద్యా కానుకలో బ్యాగ్లు, బూట్లు, యూనిఫాం విద్యార్థలకు పంపిణీ లో నాణ్యత లేకపోతే, సహించేది లేదని, నాణ్యత పై విద్యార్థులు తల్లి దండ్రులకు ఉపాధ్యాయులకు, ఫిర్యాదులు చేసేలా నా నెంబర్ షేర్ చేయాలని, సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా నాణ్యమైన వస్తువులను పంపిణీ చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దీనికి అనుగుణంగా అధికారులు కూడా క్షేత్రస్థాయిలో నాణ్యతలో రాజీ లేకుండా చూడాలని సూచించారు. సీఆర్పీలు మీ పరిధిలో ఉంటున్న సింగిల్ స్కూల్ టీచర్ ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుడు సెలవు పెట్టినప్పుడు, సిఆర్పీలు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి తరగతుల నిర్వహించాలని ఆదేశించారు. చిలకలగెడ్డ గ్రామంలోని విద్యార్థులు ఇంటికెళ్లి ఐరన్ మాత్రలపై ఆరా తీశారు. సెలవులు వర్క్ బుక్స్ ను పరిశీలించారు ఈ క్రమంలో మండల రెవెన్యూ ఆఫీసర్ రమాబాయి మండల అభివృద్ధి అధికారి కుమార్ విద్యాశాఖ అధికారి ఎల్బి వెంకట్రావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులు పక్కదారి పట్టించకుండా చూడాలి

విశాలాంధ్ర - కే **కోటపాడు** : జాతీయ ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో వివిధ రకాల నిర్మాణాలు చేపడుతూ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు ఆరోపించారు. చౌడువాడ గ్రామంలో చెరువు అభివృద్ధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఉపాధి నిధులను కూలీలకు వెచ్చించకుండా గ్రామాల్లో ఆర్బికేలు, సచివాలయాలు , అంగన్వాడి భగవనాలు, సీసీ రోడ్ల నిర్మాణం కొరకు వినియోగిస్తున్నారని అన్నారు. ఇవన్నీ కూలీలతో చేపట్టకుండా యంత్రాలతో చేపట్టి కూలీలు పొట్ట కొడుతున్నారని అన్నారు. వేసవి అలవెన్సులు, కూలీలకు పనిముట్లు, మంచినీటికి డబ్బులు చెల్లించడం లేదని అన్నారు. అలాగే సంవత్సరంలో 200 పని దినాలు కల్పించి రోజుకు 600 రూపాయలు కూలీ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగలి ముత్యాల నాయుడు, ఎర్ర దేవుడు పాల్గొన్నారు.

వెండి కిరీటం విరాళం

విశాలాంధ్ర - **సింహాచలం** : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరహాలక్ష్మీ నృసింహ స్వామివారి క్షేత్ర పాలకులు ఆంజనేయ స్వామి వారికి అడవివరం గ్రామానికి చెందిన ఎమ్.రమేష్ అనే దాత ఒక కిలోగ్రాము బరువు గల వెండి కిరీటాన్ని విరాళంగాను ఆలయ ఏ.ఈ.ఓ వై.శ్రీనివసరావుకు అందజేశారు. దాత ఇచ్చిన వస్తువుకు అప్రైజర్ సాంబమూర్తి తగు రశీదు అందజేశారు. అనంతరం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలను ఏఈఓ, ఆలయ ఇన్స్పెక్టర్ కనకరాజు అందజేశారు.

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర - పాయకరావుపేట : భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి పాయకరావుపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ ఆదేశాల

మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మోర్త సింహాచలం, పట్టణ అధ్యక్షులు పోలవరపు అప్పలరాజు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో బాలల చేత పుస్తక పఠనం

విశాలాంధ్ర - ఆనందపురం : శాఖా గ్రంథాలయం నందు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం లో ఆదివారం బాలల చేత పుస్తక పఠనం చేయించడమైనది గ్రంథాలయాధికారి బివిఎస్ అప్పారావు ఉత్తేజ పరిచే దేశభక్తుల కథలు ను ,దేశం కోసమే చేసిన త్యాగాలును గురించి వివరించి బాలబాలికలందరు దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. ఆనందపురం రామాలయం పూజారి ఉదయకుమార్ బాలబాలిక కు రామాయణం లోని పాత్రల తీరుతెన్నులు, ఔచిత్యం గురించి పిల్లలు కు అర్థం అయ్యే విధంగా క్లుప్తంగా సరళ భాష లో రామాయణం గొప్పదనం గురించి వివరించారు రాముడు వలేనే బాలలందరు పితృ భక్తిసత్యనిష్ఠ కలిగి జీవితంలో అభివృద్ధి సాధించి సమాజంలో మంచి వ్యక్తులుగా పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 15 మంది బాలబాలికల పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : 2023-2024 విద్యా సంవత్సరమునకు గాను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐ.టీ.డి.ఏ పరిధిలో నడపబడుచున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలియజేశారు. డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, జి.కె.వీధిలలో బాలురు, బాలికల విభాగంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశమునకుగాను 2022-23 విద్యా సంవత్సరములలో పదవ తరగతి చదివిన విద్యార్థుల నుండి ఆన్ లైన్ లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఏపీటీడబ్ల్యూ గురుకులం డాట్ ఏపీ డాట్ జివో విడాట్ఇన్ వెబ్ సైట్ లో సంప్రదించాలన్నారు. పూర్తి చేసిన ధరఖాస్తులు ఈ నెల 31 తేదీ లోపు సమర్పించాలన్నారు. అన్లైన్లో బైపిసి ఎంపీసీ హెచ్ఈ పి గ్రూపులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమాచారం కొరకు 9908595435, గురుకులం ఓ ఎస్ డి 9493758072 ఫోన్ నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

89వ వార్డులో 31న క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 89వ వార్డు చంద్ర నగర్ గ్రౌండ్ నందు యువ నాయకులు ఐతం శెట్టి గోపి జన్మదినోత్సవం మే 31 సందర్భంగా 42 జట్లతో నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడా పోటీలను పశ్చిమ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ ఎస్. ఏ రెహమాన్ గారు ప్రారంభించారు. మొదటిరోజు మొట్టమొదటి మ్యాచ్ ను తొలి బంతిని జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు గారు వేయగా బ్యాట్ తో ఎదుర్కొని ఎస్.ఏ. రెహమాన్ ప్రారంభించారు. పిదప ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉత్సాహానికి శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయని తెలిపారు. 42 జట్లతో జరుగుతున్న ఈ క్రీడా పోటీలు యొక్క ఫైనల్స్ మే 31 వ తేదీన జరిగి బహుమతులు ప్రధానం పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త, ఏ.పి.ఎమ్.ఎస్.ఎమ్.ఇ.డి.సి చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు, మాజీ కార్పొరేటర్ ఐతం శెట్టి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, స్వామి నాయుడు, సచివాలయ క్లస్టర్ కన్వీనర్ గేదెల మురళీకృష్ణ, 91 వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92 వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, 90 వ వార్డు సీనియర్ నాయకులు నమ్మి శ్రీను, ఊటపల్లి గోవిందు, దుర్గేష్, గంగరాజు, వైట్ రాజు, క్రీడాకారులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో జార్జిక్లబ్ యోగాసెంటర్ వార్షికోత్సవం

విశాలాంధ్ర - అనకాపల్లి : పట్నంలోని గల జార్జ్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా సెంటర్ ప్రధమ వార్షికోత్సవం ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు యోగా గురువు, కేంద్రం గౌరవాధ్యక్షులు భీశెట్టి దోరమనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా అందరికీ ఆరోగ్యం పెంపొందించేందుకు ఈనెల 27న యోగాపై చైతన్య ర్యాలీ పట్టణ పురవీధుల మీదగా ఉంటుంది, 28 ఆదివారం యోగాసనాలు ప్రతిభ కనబరిచిన వారికి కాంపిటీషన్ నిర్వహించి, సాయంత్రం జార్జ్ క్లబ్ ప్రతినిధులు, అతిరథ మహారధులు హాజరు అవుతారని ఆయన తెలిపారు. బహుమతులు అందజేస్తారని భారత స్వాభిమాన ట్రస్ట్, పతాంజలి యోగ సమితి భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు భీశెట్టి దోరమనాయుడు అన్నారు. యోగా గురువు ఎం. జనార్ధన్ (జగన్), పెంటకోట సుబ్ర హ్మణ్యం, కొలవర్తి కన్నబాబు, భీమరిశెట్టి. శ్రీనివాసరావు, ఆడారి చిన్న వీరు నాయుడు, కాండ్రేగుల మురళి, కొణతాల శివాజీ, ఏ.రామకృష్ణ, మాదేటి సత్యనారాయణ, కె.వి.సత్యనారాయణ , కొణతాల పెద్ద కాండ్రేగుల చిన్న, ఆడారి ప్రేమ్ కుమార్, డి.శ్రీనివాసరావు, పందూరి సత్య నారాయణ, గణేష్, మహేష్ యోగ ప్రియులు యావన్మంది ఈ కార్యక్రమాలకు హాజరవి వినియోగించుకోవాలని అన్నారు.

క్విజ్ పోటీల వల్ల జ్ఞాపకశక్తి మెరుగు



విశాలాంధ్ర - మల్కాపురం : క్విజ్ పోటీల వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మేధస్సు వికసిస్తుందని, ఏకాగ్రత కుదురుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్విజ్ పోటీలలో చురుకుగా పాల్గొనాలని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాత్రికేయులు గోవిందరాజులు మాట్లాడుతూ క్విజ్ పోటీలలో పాల్గొన్నవారు భవిష్యత్తులో పోటీ పరీక్షలలో మంచి మార్కులు సంపాదించి, ఉద్యోగాలు చేపడతారని అన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు బాగా ఉపయోగించుకున్నప్పుడే క్విజ్ పోటీలలో పాల్గొనడం సులభం అవుతుందని అన్నారు. సమావేశానికి రచయిత కె. సత్తిరాజు, కార్మిక నాయకులు బి.సత్యానందం గౌరవ అతిథులుగా హాజరయ్యారు. వారు గ్రంథాలయాలలో లభించే జనరల్ నాలెడ్జి పుస్తకాలపై ప్రసంగించారు. అనంతరం క్విజ్ పోటీలో విజేతలకు గోవిందరాజులు చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. జాతీయ సేవా పథకం సీనియర్ వలంటీర్ అలేఖ్య చిన్నారులకు నాట్యంలో శిక్షణ ఇచ్చారు. 10 సంవత్సరాల లోపు పిల్లలు ఇండోర్ గేమ్స్ లో పాల్గొన్నారు.

అదాని పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



విశాలాంధ్ర - గాజువాక సిటీ : గంగవరం అదాని పోర్టు కార్మికుల వెంటనే సమస్యలు పరిష్కరించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం దిబ్బపాలెం గ్రామంలో పోర్ట్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి పోర్టు కార్మికులు చాలీచాలని జీతాలతో జీవనాన్ని నెట్టుకొస్తున్నారు. కార్మికులకు వేతనాలు పెంచకుండా పోర్టు యాజమాన్యం మొండి వైఖరి చూపిస్తుందని, కనీస వేతనాలు చట్టం అమలు చేయడం లేదని ప్రక్కనే ఉన్న పోర్టు ఉద్యోగులు వేతనాలు చూసి అయిన పోర్టు యాజమాన్యం కార్మికులు కు కనీస వేతనం 36000 రు. ఇవ్వాలిని పోర్టు యాజమాన్యం తొలగించిన కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వచ్చే నెల ఒకటి నుంచి కార్మికుల వేతనాలు పెంచలేని సమక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని పోర్టు యాజమాన్యానికి హెచ్చరిక జారీ చేశారు. కార్మికులు సమస్యలు పరిష్కరించేంత వరకు పోర్టు కార్మికులకు అండగా ఉంటామన్నారు. అఖిలపక్ష నాయకులు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు సిఐటియు నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గంగవరం పోర్టు స్థాపించినప్పటి నుంచి లాభాల బాటలో వస్తున్నప్పటికీ కార్మికుల వేతనాలు పెంచడం లేదని కార్మికులందరూ ఐక్యత గా ఉండి కార్మికుల హక్కులు సాధించేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శంకర్రావు కుటుంబాన్ని పరామర్శించిన సిఐటియు నాయుకులు

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు పరిధి పురుషోత్తపురంలో నివాసం ఉంటున్న స్టీల్ ప్లాంట్ ఉద్యమనేత బాయిపల్లి శంకర్ రావు కుటుంబాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు డిప్యూటీ జనరల్ సెక్రటరీ టీవీ కృష్ణంరాజు, మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర నాయకులు సిహెచ్ సత్యనారాయణ తదితరులు ఆదివారం ఉదయం పరామర్శించారు. శంకర్రావు సతీమణి ఇటీవల పరమపదించడంతో వారి కుటుంబ సభ్యుల్ని సిఐటియు రాష్ట్ర నాయుకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నరసింగ రావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో పాల్గొని గొంతుకులో తూటా దిగడంతో ఆ రోజు నుంచి శంకర్రావు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భావితరాల కోసం ఉద్యమంలో పాల్గొని చాలామందికి ఉద్యోగులు కల్పనలో ఆయన కృషి ఎంతో ఉందని కొనియాడారు. స్టీల్ ప్లాంట్ కోసం 829 రోజులుగా ఉద్యమం చేస్తున్నామని, సుమారు 32 మంది ప్రాణ త్యాగాలు చేసిన ప్లాంట్ ను కాపాడుకునేందుకు రాష్ట్రంలోని ప్రజలందరూ ఏకం కావాలన్నారు. ఆదాని అంబానీలకు కట్టపెట్టడానికి బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ప్రజలందరితో సంతకాల సేకరణ చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేసారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని రింగల గ్రామానికి చెందిన మడకం రాజయ్య (60) ఆదివారం సాయంత్రం వడదెబ్బకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. అతన్ని కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా చింతూరు చేరే సమయానికి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హాకీ సమ్మర్ క్యాంపుని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి



విశాలాంధ్ర - యలమంచిలి రూరల్ : యలమంచిలి రాజీవ్ క్రీడా మైదానంలో 2023 హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపు యలమంచిలి హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ప్రారంభించారు. ఈ సమ్మర్ క్యాంపుకు యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివిన 1980వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యా ర్థులు సుమారు 50 వేల రూపాయల విలువ చేసే హాకీకి సంబంధించిన సామాగ్రిను వితరణ చేసారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్థానిక డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పి.డి.పోలిరెడ్డిలు మాట్లాడుతూ హాకీ క్రీడలో యలమంచిలికి గల 120 సంవత్సరాల చరిత్రను నేటి తరం క్రీడాకారులు మరింత అభివృద్ధి సాధించి, మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు సన్యాసి రాజు, అలీ, సుంకర కొండ, నూకరాజు, భద్రరావు,వై హెచ్ ఎ ప్రెసిడెంట్ జీ.వి. రెడ్డి పాల్గొన్నారు. ఈ క్యాంపు వచ్చే జూన్ నెలలో పాఠశాలలు తెరిచే వరకు ఉంటుందని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వైహెచ్ఏ సెక్రటరీ నరేష్ తెలిపారు.

మద్యానికి బానిసలై ప్రాణాలు పోగొట్టుకోవద్దు

విశాలాంధ్ర - **అరకులోయ** : గిరిజనులు మద్యానికి బానిసలై విలువైన ప్రాణాలు పోగొట్టు కోవద్దని హ్యూమన్ రైట్స్ అన్ ఏంటి క్రైమ్ అసోసియేషన్ రాష్ట్ర ఏజెన్సీ మహిళా అధ్యక్షురాలు కె కృష్ణ కుమారి చెప్పారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా నాటుసారా విక్రయాలు జరుగుతుండటంతో దానికి బానిసలై గిరిజనులు ప్రాణాలు పోగొట్టుకొని తమ కుటుంబాలను రోడ్డున వదేస్తున్నారని చెప్పారు. నాటుసారా సేవించడం వల్ల కుటుంబమంత వీధిపాలు అవుతున్నాయని, దీని మీద ప్రతి ఒక్కరు అవగాహన పరచుకొని మద్యం సేవించ కుండా ఉండాలని కోరారు. గ్రామాల్లో ఉండే యువత నాటుసార విక్రయాలను గ్రామాల్లో జరగకుండా నిలుపుదలకు ఐక్యంగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందని ఆమె చెప్పారు.

ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర నేత మహంకాళి సుబ్బారావు

విశాలాంధ్ర - విశాఖ : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొట్టమొదటిగా జాబ్ క్యాలెండర్ ద్వారా జనవరి ఒకటో తేదీన అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2లక్షల 30 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఏఐవైఎఫ్ రాష్ట్ర నేత మహంకాళి సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ అల్లిపురంలోని నీలం రాజశేఖరెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా, నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం కె.అచ్యుత్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక మాదక ద్రవ్యాల ముఠాల్లో చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోకి కొత్త పరిశ్రమలు రాకపోవడం వల్ల ఉపాధి కోసం పక్క దేశాలు, రాష్ట్రాల పరిశ్రమల్లో కూలి పనులకు వెళ్లి అక్కడ యాజమాన్యాల చేతుల్లో నలిగిపోతున్నారని అన్నారు. తక్షణమే ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని, ప్రజా ప్రతినిధులను అడ్డుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. యువకులు సమాజంలో అనేక సమస్యలపై పరిష్కారం కోసం ఉద్యమాలు ఉధృతం చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, కో - కన్వీనర్ మధు, నాగరాజు, సందీప్ నియోజకవర్గ పాల్గొన్నారు.

పైనంపాడు సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - అనంతగిరి : వినతి అందజేసిన పైనంపాడు వాసులకు భరోసా ఎంపీపీ శెట్టి నీలవేణి అనంతగిరి మండలంలో మారుమూల పంచాయతీ అయినటువంటి పైనంపాడు పరిధిలో



నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషిని అందిస్తానని ఎంపీపీ నీలవేణి హామీ ఇచ్చారు. శాసనసభ్యులు చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించగా ఆ కార్యక్రమం ముగించుకున్న ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కాసేపు ముచ్చ టించారు. అనంతరం పైనంపాడు గ్రామంలో స్థానిక గిరిజనులతో మమేకమై అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పైనంపాడులో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని అదే విధంగా గ్రామాల్లో సిసి రోడ్లు మెరుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఈ సందర్భంగా ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు.ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిని అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. వరుసగా రెండో రోజు సోమవారం పంచాయతీ పరిధిలోని గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగనున్న నేపద్యంలో స్థానిక గిరిజనులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లాలని అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పై అభిప్రాయాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి మాజీ వైస్ ఎంపీపీ సీదరి గుండన్న వైస్ సర్పంచ్ గురుమూర్తి ఎంపీటీసీ తమ్మన్న స్థానిక పెద్దలు ఆనంద్ఇంచార్జ్ ఈవోపీఆర్డి గోపాలకృష్ణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



విశాలాంధ్ర - యలమంచిలి : యలమంచిలి పట్టణంలో ఆదివారం నాడు భారత మాజీ ప్రధాని దివంగత నేత స్వర్గీయ రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుందరపు ఈశ్వరరావు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, 2 నిమిషాలు పాటూ మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ భారతదేశంలో గ్రామ స్వరాజ్యం రావాలని, గ్రామంలో పరిపాలన సాగాలనే ఉద్దేశ్యంతో గ్రామ పంచాయతీ వ్యవస్థను, ఎంపీటీసీ, జెడ్పిటీసీ వ్యవస్థలను తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీ దేనని అంటూ ఆ మహనీయుని సేవలు కొనియడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కోన వరహాలరావు, సుందరపు సాయికృష్ణ, గొల్లవిల్లి సత్యనారాయణ, అద్దెపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఏడు గృహాలు దగ్ధం

విశాలాంధ్ర - చింతూరు : అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు మండలంలోని బొడ్రాయిగూడెం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పులి వారి గుంపుకు చెందిన పులి బ్రహ్మయ్య, మీడియం భద్రమ్మ అనే గిరిజనులకు చెందిన 7



ఇళ్ళు, మేకల పాకలు, ట్రాక్టర్ షెడ్డు, దగ్ధం అయ్యాయి. వీటితోపాటు వరి నూర్పుడు యంత్రం, ట్రాక్టర్ సామాను, టైర్లు దగ్ధమయ్యాయి. దీంతో ఏడు కుటుంబాల వారు సర్వం కోల్పోయి నిరాశ్రాయులయ్యా రు. కట్టు బట్టలతో బయట పడ్డారు. ఇంట్లో ఉన్న డబ్బు,20 బస్తాల ధాన్యం, 20 బస్తాల బియ్యం ఇంట్లో వంట సామాగ్రి అగ్నికి అహుతి అయ్యాయి.

ఘనంగా నూతన జనసేన రూరల్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - **ఆనందపురం** : నందపురం వేములవలస జంక్షన్లో మూడు మండలాలకి సంబంధించి నూతన రూరల్ పార్టీ కార్యాలయంను భీమిలి జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం సందీప్ మాట్లా డుతూ భీమిలిలో నియోజ వర్గం కార్యాలయం ఉండగా రూరల్ మండలాలకు సంబంధించి మరింత చేరువుగా ఉండేవిధంగా రాబోయే రోజుల్లో జనసేన పార్టీ కార్యా లయంలో గ్రామస్థాయి నుండి సమస్యలు పరిష్కారం దిశగా ఈ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తున్నామని వచ్చే నెల నుండి గ్రామ స్థాయి మండల స్థాయి కమిటీలు వేస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారు జూన్



నుండి వారాహి యాత్ర చేపట్ట బోతు న్నారని పార్టీ కోసం మరిన్ని ప్రణాళికలు తయారు చేస్తున్నామని రాష్ట్ర స్థాయి నాయకులు ప్రతినెల జిల్లా నాయకులతో మాట్లాడుతారని భీమిలి నియోజవర్గంలో జనసేన పార్టీ ఇంకా మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా అలాగే ఉత్త రాంధ్రలో క్రియాశీలక సభ్య త్వాల్లో భీమిలి మొదటి స్థానంలో నిలిచిందని, రేపు రాబోయే అసెంబ్లీ ఎలక్షన్లో భీమిలిలో జనసేన జెండా ఎగర వేస్తామని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని ఇంత చక్కటి కార్యక్రమానికి కృషి చేసిన నాయకులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు శివశంకర్, యసస్వి, ప్యాక్ నెంబర్ కోన తాతారావు, అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శులు అప్పారావు ,శివ దత్తు, ప్రశాంతి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ 33వ కార్పొరేటర్ వసంత లక్ష్మి, 22 కార్పొరేటర్ పీతల గురు మూర్తి యాదవ్, 64 కార్పొరేటర్ గోవింద్, శాఖరి శీను బాబు, మండల నాయకులు మజ్జి శ్రీను, దుక్క వెంకట్రావు, తమ్మిన అప్పల రాజు, తాడివాడ శివకృష్ణ, బొడ్డాపు గోవిందు, డాక్టర్ పిన్నింటి సన్యాసి రావు, కొయ్య నాని, తెడా_ప్పు. నర్సింగరావు, మీసాల నాగేశ్వర రావు, తైలం రఘు, ప్రశాంత్‌కుమార్ నాయుడు తదితరులున్నారు.

ఆసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ

- ప్రభుత్వ పథకాలు విఫలమైన చోట... స్వచ్ఛంద సేవా సంస్థ సక్సెస్
- గిరిజనులకు తాగునీరు అందిస్తూ మన్ననలు పొందుతున్న సాయిరాం ట్రస్టు

విశాలాంధ్ర - చింతపల్లి : ఆసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, ప్రభుత్వ పథకాలైన జలజీవన్ మిషన్ పనులు విఫలమైన చోట కూడా సక్సెస్ అవుతూ, మారుమూల గిరిజన గ్రామాలకు త్రాగు నీరు అందిస్తూ ముందుకు సాగుతోంది ఒక స్వచ్ఛంద సేవా సంస్థ. సాయిరాం ట్రస్ట్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ త్రాగు నీరు లేని గిరిజన గ్రామాలలో గ్రావిటీ పథకం ద్వారా త్రాగు నీరు అందిస్తూ గిరిజనుల మన్ననలు పొందుతోంది. త్రాగు నీరు లేని గిరిజన గ్రామాలకు త్రాగు నీరు అందించడమే గాక, ప్రభుత్వ పథకాలైన జలజీవన్ మిషన్ వంటి పనులు విఫలమైన చోట కూడా నీరు అందిస్తూ శభాష్ అనిపించుకొంటోంది. త్రాగు నీరు లేని గిరిజన గ్రామాల ప్రజలు సాయిరాం ట్రస్టును ఆశ్రయించినట్లు అయితే ట్రస్టు వారు వచ్చి, అక్కడి స్థితి గతులు చూసి, దగ్గరలో ఉన్న కొండ మీద ఉన్న ఊటకుంటను గుర్తించి, గ్రామస్తుల భాగస్వామ్యంతో అక్కడి నుండి గ్రావిటీ పథకం ద్వారా గ్రామంలోనికి త్రాగు నీటిని తెప్పిస్తారు. గ్రామంలో అనుకూలమైన చోట నీటి ట్యాంక్ ను నిర్మించి అక్కడి నుండి ఇళ్లకు కుళాయి ల ద్వారా త్రాగు నీరు సరఫరా చేస్తారు. ప్రభుత్వ నుండి త్రాగునీటి పథకం పొందని గ్రామాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ, ఇప్పటి వరకు మన్యంలో వందల గ్రామాలకు సాయిరాం ట్రస్టు త్రాగు నీరును అందించింది. అయితే మొన్న బయలుకించంగి పెద్ద వీధి గ్రామంలో జలజీవన్ పథకం ద్వారా లక్షలు ఖర్చు పెట్టి చేసిన పనులు విఫలమయ్యాయి. మా గ్రామానికి త్రాగు నీరు అందించండి మహాప్రభో అని వారు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలసిపోయారు. చివరకు సాయిరాం ట్రస్టును ఆశ్రయించారు. వారు వచ్చి త్రాగు నీటి కొరకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను చూసి చలించి పోయారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో సుమారు ఎనిమిది కిలో మీటర్ల దూరం నుండి గ్రామంలోకి గ్రావిటీ ద్వారా నీటిని రప్పించి అందరిని ఆశ్చర్య చకితులను చేశారు. నిన్న అన్నవరం పంచాయతీ సోమవరం గ్రామంలో అధికారులు చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు విఫలమయ్యాయి. అక్కడ కూడా సాయిరాం ట్రస్టు వారు పనులు చేపట్టి వారికి నిత్యం త్రాగు నీరు అందిస్తున్నారు. ఇలా మన్యంలో వందల గ్రామాలకు త్రాగు నీరు అందిస్తూ మన్య వాసుల మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్న సాయిరాం ట్రస్టు సేవలు మరిన్ని మారుమూల గిరి గ్రామాలలో కూడా విస్తరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కాలినడకన గిరి గ్రామాల సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రాకతో హర్షం వ్యక్తం చేసిన ఆదివాసీలు

విశాలాంధ్ర - కొయ్యూరు : కనీస రహదారి సౌకర్యం లేని మారుమూల ఆదివాసి గిరి గ్రామాలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కాలినడకన సందర్శించి అక్కడి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీ పరిధి మారుమూల సంగంవలస నక్కలమెట్ట గంగవరం తదితర కనీస రహదారి సౌకర్యం లేని పలు మారుమూల గ్రామాలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కొద్ది దూరం ద్విచక్ర వాహనంపై వెళ్లి అక్కడినుండి కొండవాగులు దాటుతూ కాలినడకన ఆయా గ్రామాలకు వెళ్లి అక్కడి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండవాగులు దాటుతూ కాలినడకన ఎమ్మెల్యే ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు తమ గ్రామాలకు రావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని సాదరంగా ఆహ్వానించి వారి సాధక బాధకాలను విన్నవించుకున్నారు. తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ దడాల.రమేష్, ఎంపీటీసీ మాధవరావు, మల్లేశ్వరి ఎంపీపీ రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు బాబులు ఏఎంసీ చైర్ పర్సన్ రాజులమ్మ వైస్ ఎంపీపీలు వెంకటరమణ నూకాలమ్మ సావిత్రి వీఆర్వో పండయ్య తదితర పలువురు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం

విశాలాంధ్ర - కొయ్యూరు : ప్రభుత్వానికి ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే రైతు సమస్యలను పరిష్కరించాలని టిడిపి ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి జంపా వెంకటరమణ డిమాండ్ చేశారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రైతులకు సాగునీరందించే ఉద్దేశంతో వ్యవసాయ బోర్లు వేసినప్పటికి ఎన్నికల సమీపించడంతో అసంపూర్తిగా కలెక్షన్లు ఇవ్వకుండా వదిలేసారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కూడా ఎంతో ఆర్భాటంగా వైసీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని గొప్పలు చెప్పుకునేందుకు ఒకటి రెండు చోట్ల బోర్లు వేయించిన వాటికి నేటికీ కనెక్షన్లు ఇవ్వలేదని గుర్తు చేశారు. బోర్లు కొట్టించి నిరుపయోగంగా వదిలేయడంతో కూరుకుపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఎంతో ఆర్భాటంగా బోర్లు నిర్మించి కలెక్షన్లు లేకుండా వదిలేయడం వల్ల ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. ఇలా బోర్లు నిర్మించి అర్ధాంతరంగా వదిలేయడం వల్ల ప్రజాధనం వృధా తప్ప రైతులకు ఒరిగిన మేలేంటని వెంకట రమణ ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణం నిరుపయోగంగా వదిలేసిన బోర్లను వినియోగంలోనికి తీసుకువచ్చి రైతాంగానికి మేలు చేకూర్చాలని వెంకటరమణ డిమాండ్ చేశారు.

విద్యుత్ కోతలతో వేగలేకపోతున్నాం...కిరోసిన్ ఇప్పించండి మహాప్రభో..

గిరిజన ప్రజల ఆవేదన

విశాలాంధ్ర - చింతపల్లి : విద్యుత్ కోతలతో వేగలేకపోతున్నాం... కిరోసిన్ ఇప్పించండి మహా ప్రభో అని మన్య ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకొనే పరిస్థితి ప్రస్తుతం చింతపల్లి మండలంలో ఏర్పడింది. చింతపల్లి మండల పరిధిలో ఎక్కడ ఒక చిన్న చినుకు పడినా మండలం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఇక మారు మూల గ్రామాలలోనైతే పరిస్థితి ఇంకా దారుణం. విద్యుత్ నలిచి పోయిందంటే చాలు ఎందుకు పోయిందో? తెలియదు. మరలా ఎప్పుడు వస్తుందో? ఎవరికీ తెలియదు. రాత్రి సమయంలోనైతే పరిస్థితి మరింత దారుణం. సరిగ్గా అన్నం తిందామని కూర్చునేసరికి విద్యుత్ పోతుంది. ఎందుకు పోతుందో ఎవరికీ తెలియదు! మరలా ఎప్పుడు వస్తుందో,. ఎవరిని సంప్రదించాలో తెలియదు. ఈ పరిస్థితి గత కొన్నేళ్లుగా మండలంలో నిత్య కృత్యంగా మారింది. వర్ష కాలంలోనైతే ఈ పరిస్థితి మరింత దారుణం. చింతపల్లి విద్యుత్ శాఖ అధికారుల తీరుతో విసిగిపోయిన గిరిజన గ్రామాల ప్రజలు "విద్యుత్ కోతలతో పడలేక పోతున్నాం. కిరోసిన్ ఇప్పించండి మహా ప్రభో" అని వేడుకునే పరిస్థితి ప్రస్తుతం మండలంలో దాపురించింది. మరికొందరైతే "విద్యుత్ వద్దు కిరోసినే ముద్దు" అని అంటున్నారు. విద్యుత్ శాఖ పనితీరుపై నమ్మకం పెట్టుకున్న ఏపీ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఏపీ ప్రజలకు కిరోసిన్ సరఫరాను నిలిపివేసింది. ఒకప్పుడు మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు కిరోసిన్ దీపాలే వెలుగు దివ్వెలుగా నిలిచేవి. కాలాలు మారాయి. ప్రభుత్వాలు మారాయి. ప్రతీ గ్రామానికి విద్యుత్ సరఫరా అందే విదంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందుకు తగినట్లుగానే కార్యాచరణ జరిగింది. అయితే ఏం లాభం! అందుకు తగినట్లుగా ప్రజలకు సేవలందించడంలో మన్యంలోని విద్యుత్ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. విద్యుత్ ఎప్పుడు, ఎందుకు తీస్తారో తెలియదు. మరలా కరంట్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ప్రస్తుతం మన్యంలో నిత్య కృత్యంగా మారింది. గత కొద్ది రోజులుగా మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలు విదిస్తున్నారు. దానితో విద్యుత్ శాఖ అధికారుల పనితీరుతో విసిగిపోయిన ప్రజలు విద్యుత్ కోతలతో వేగలేకపోతున్నాం... కిరోసిన్ ఇప్పించండి మహా ప్రభో అని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పేదరికంలో పుట్టడం తప్పు కాదు.. పేదరికంలో మరణించడం తప్పు

ఆర్ఐ దుమంతి సత్యనారాయణ

విశాలాంధ్ర - కొయ్యూరు : పేదరికంలో పుట్టడం తప్పు కాదని.. కానీ అదే పేదరికంతో మరణించడం తప్పు అనే అంబేద్కర్ మాటలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుంటూ అతని ఆశయాలను సాధించాలని ఆర్ఐ దుమంతి సత్యనారాయణ పిలుపునిచ్చారు. అడవి బిడ్డలకు విద్యాదానం పేరిట ఆర్ ఐ సత్యనారాయణ చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని చింతవానిపాలెం గ్రామానికి చెందిన మండి.బి.తేజశ్రీ జర్త దుర్గాభవాని కూనిశెట్టి శాంతిప్రియ వారి తల్లిదండ్రులను అభినందిస్తూ సత్యనారాయణ సాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామ పెద్దలు జర్తా.చెల్లయ్య, ఎంపీటీసీ మల్లికార్జున్ వార్డు సభ్యులను సైతం సన్మానించిన ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పిన పేదరికంలో పుట్టడం తప్పు కాదని కానీ పేదరికంలోనే మరణించడం తప్పు అనే మాటలను గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు కష్టపడి ఉన్నత స్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. విద్యార్థులంతా కష్టపడి ఇష్టంతో చదివితే మంచి భవిష్యత్తు వారి సొంతం అవుతుందని సూచించారు. విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ అలవర్చుకోవడంతోపాటు దైవభక్తి సేవాభావాలను అలవర్చుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మానవసేవే మాధవసేవ అని ఆపదలో ఉన్న వారిని కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న సంతృప్తి ఆనందం మరెందులోనూ దొరకదని ఈ సందర్భంగా సత్యనారాయణ తెలియజేశారు.

డుంబ్రిగూడలో భారీ వర్షం

విశాలాంధ్ర - డుంబ్రిగూడ : డుంబ్రిగూడ మండలంలోని భారీ వర్షం కురిసింది. ఇటీవల కాలం నుండి భానుడి తాపంతో విలవిలలాడుతున్న గిరిజనులు ఆదివారం కురిసిన వడగళ్ల భారీ వర్షంతో మండల ప్రజలు ఊపిరిపించుకున్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత ఉండడంతో ముఖ్యంగా వృద్ధులు చిన్నపిల్లలు ఉ క్కపోత తో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షంతో మండల ప్రజలు చల్లబడ్డారు.

అగ్ని ప్రమాద బాధితులకు పోలీస్ చేయూత

విశాలాంధ్ర - చింతూరు : చింతూరు మండలం బొడ్రాయి గూడెం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమా దంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో ప్రమాదానికి కారణాలు తెలుసుకొని బాధితులకు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పల నాయుడు, ఎస్సై శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ గ్రౌండ్లో ఒక హ్యాండ్ బోరు ఏర్పాటు చేయాలి : ఆమ్ ఆద్మీ పార్టీ

విశాలాంధ్ర - అనకాపల్లి : అనకాపల్లి హై స్కూల్ గ్రౌండ్ నందు ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు హై స్కూల్ గ్రౌండ్‌లో ఆడుకుంటున్నటు వంటి పిల్లలకు దాహం తీర్చాలని అనకాపల్లి ఆమ్ ఆద్మీ పార్టీ శాఖ గత ఐదు రోజులుగా రోజు మంచినీళ్లు సరఫరా చేస్తున్నారు. హై స్కూల్ గ్రౌండ్ లో ఆడుకుంటున్నటువంటి పిల్లలు ఎంతో ఆనందంతో చల్లని మంచినీళ్లు తాగుతున్నారు. ఈ మంచినీళ్ల సరఫరా ఎండలు తగ్గేంతవరకు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నిర్ణయించుకుంది. హై స్కూల్ గ్రౌండ్ లో ఏదో ఒక భాగంలో హ్యాండ్ బోరు ఏర్పాటు చేసినట్లయితే ఇక్కడికి వచ్చినటువంటి వాకర్స్, ఆటలాడుకునే పిల్లలకు దాహం తీర్చుకునేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. అధికార పార్టీ ప్రభుత్వం స్పందించి హైస్కూల్ గ్రౌండ్లో ఒక హ్యాండ్ బోరు ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ కోరుతుంది. ఈ మంచినీళ్లు సరఫరా చేయడంలో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొలతల హరినాథ్ బాబు, సిహెచ్ శ్రీనివాసరావు, పి బాబ్జి పిల్లలకు మంచినీళ్లు సరఫరా చేశారు.

రాజీవ్ గాంధీ ఆశయా సాధనకు యువత రాజకీయాలలోకి రావాలి : గంగాధర్

విశాలాంధ్ర - అనకాపల్లి : శాస్త్ర, సాంకేతిక రంగాలను భారత్ లో ప్రవేశపెట్టిన ఘణత భారత మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ కే దక్కుతుందని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి గంగాధర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతు 18 సంవత్సరాలకే యువకులకు ఓటు హక్కు కల్పించి యువకులకు పాలనలో భాగస్వామ్యం కల్పించారని అన్నారు. దేశంకోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయాలు సాధించుటకు యువత రాజకీయాలలోనికి రావాలని గంగాధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్ కుమార్, తేబ్బుడి సంతోష్, మళ్ళ శివకుమార్, పిల్లి త్రినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆసుపత్రిలో 40వ అంతర్జాతీయ కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఎ యిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిఎంహెచ్ఓ డాక్టర్ ఎ. హేమంత్ మాట్లాడుతూ. ప్రపంచంలో ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారి ఆత్మ శాంతి కోసం ప్రతి ఏటా మే నెల మూడవ ఆదివారం క్యాండిల్ లైట్ ర్యాలీ ను నిర్వహిస్తామన్నారు. అనంతరం 40వ అంతర్జాతీయ కొవ్వొత్తుల ర్యాలీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డీసీహెచ్ డాక్టర్ శ్రావణ్ కుమార్, డీఎల్ఎటిఓ డాక్టర్ సీ. కిషోర్ కుమార్, ఏ ఆర్ టి వైద్య అధికారి డాక్టర్ ప్రియదర్శిని, టీ బీ సూపర్‌వైజర్, ఐసీటీసీ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, ఏ ఆర్ టీ సిబ్బంది క్యాండిల్ లైట్ ర్యాలీకి హాజరయ్యారు.

రంపచోడవరంలో శాస్త్రోక్తంగా విగ్రహస్థాపన

విశాలాంధ్ర - రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లా రంప చోడవరంలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ విగ్రహస్థాపన ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బింబ శుద్ధి కోసం శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ గోదాదేవి, శ్రీ గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాలను మంత్రపూరితమైన పవిత్ర జలంతో అభిషేకం చేశారు. అంతకుముందు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, ఆలయానికి, రాజగోపురానికి విమానకలశస్థాపన, విగ్రహస్థావన చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు మహా శాంతి, పూర్ణాహుతి, చతుర్దశ కలశస్నపనం, నవకలశస్నపనం, మహాశాంతి తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు యాగశాల వైదిక కార్యక్రమాలు, రక్షాబంధనం, శయనాధివాసం, విశేష హెూమాలు నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో జేఈవో శ్రీ వీరబ్రహ్మం, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు శ్రీ వేణుగోపాలదీక్షితులు, ఎస్ఈ శ్రీ సత్యనారాయణ, విజివో శ్రీ మనోహర్, డెప్యూటీ ఈవోలు శ్రీ గుణభూషణ్ రెడ్డి, శ్రీ వెంకటయ్య, శ్రీ శివప్రసాద్, డెప్యూటీ ఈఈలు శ్రీఆనంద రామ్, శ్రీ నాగభూషణం, శ్రీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఆదివాసి విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా వంతల గోపీనాథ్

విశాలాంధ్ర - చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ గా వంతల గోపీనాథ్ నియమితులయ్యారు. అల్లూరి జిల్లా పాడేరు నియోజక వర్గానికి చెందిన చింతపల్లి మండలం పెండ్లి మామిడి గ్రామ నివాసి అయిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వంతల గోపీనాథ్ ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు . ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి పి రాకేష్ రెడ్డి, అల్లూరి జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు ఆశీస్సులతో. ఏ.పీ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి విభాగం రాష్ట్ర కో. ఆర్డినేటర్ (సమన్వయకర్త) గా. నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ నియామక ఉత్తర్వులను ఆ పార్టీ.ఆదివాసి చైర్ పర్సన్ పాచి పెంట శాంతకుమారి గోపినాథ్ కు అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వాన్ని సమన్వయ పరుస్తూ కాంగ్రెస్ పార్టీ విధి.విధానాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవానికి కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ కు పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర సూరిబాబు, సీనియర్ నాయకులు సాగిన కృష్ణ పడాల్. లకే. రమణ, గెమ్మెలి రామచందర్,. కొర్ర మోహన్ రావు. శెట్టి ప్రసాద్, గెమ్మెలి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కాసినవి కావు... వేలాడదీసినవి

పర్యాటకులను ఆకర్షిస్తున్న ఆకతాయిల ఆలోచన

ఎండిన వృక్షానికి వేలాడుతున్న సీసాలు

విశాలాంధ్ర - చింతపల్లి : ఈ చిత్రంలో కనిపిస్తున్నవి చెట్టుకు కాసినవి కావు... ఆకతాయిలు వేలాడదీసినవి. ఆకతాయిలు చేసే ఇటువంటి చేష్టలు కూడా మన్య ప్రాంతంలో పర్యాటకు లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆంధ్ర ఊటీగా అరకు, ఆంధ్ర కశ్మీర్ గా చింతపల్లి మండలంలోని లంబసింగి లతో పాటు మన్యం మండలాలలో ప్రతి ప్రాంతం ఏదో ఒక రూపంలో పర్యాటకులను ఆకట్టుకునే ప్రదేశాలే. జి మాడుగుల మండలానికి చెందిన కొత్తపల్లి జలపాతం, జీకే వీధి మండలంలో సీలేరు పవర్ ప్రాజెక్ట్, ఇలా చెప్పుకుంటూ పోతే పర్యాటకానికి మన్య ప్రాంతం ఒక మణిహారం. ఎండిన వృక్షానికి సీసాలను వేలాడదీయాలన్న ఆలోచన ఎవరికి వచ్చిందో గాని, ఆ వేలాడదీసిన సీసాల కారణంగా ఆ ఎండిన వృక్షం అందాన్ని ఆపాదించుకుని చూపరులను విశేషంగా ఆకర్షిస్తుంది. చెట్లకు ఈ విధంగా మద్యంతో కూడిన సీసాలు పుట్టుకొచ్చినట్లయితే ప్రతి ఒక్కరూ మద్యం వృక్షాలు పెంచుకొని మత్తులో జోగుదురేమో అని పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

మండుతున్న ఎండలు...

ఉక్క పోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మన్య ప్రాంత ప్రజానీకం

విశాలాంధ్ర - చింతపల్లి : మునుపెన్నడూ లేని విధంగా మన్య ప్రాంతంలోనూ మండుతున్న ఎండలతో మన్యవాసులు ఉక్క పోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపంతో రాష్ట్రం యావత్తు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయినప్పటికీ మన్య ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదై నిత్యం శీతల వాతావరణానికి పేరెన్నిక గన్న ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి ప్రాంతంలోనూ నేడు ఎండలు ప్రతాపం చూపుతున్నాయి. అభివృద్ధి, పోడు వ్యవసాయం తదితర వాటి ప్రమేయంతో నేడు మన్య ప్రాంతం మైదాన ప్రాంత వాతావరణాన్ని తలపిస్తుంది. గతంలో 30 డిగ్రీల ఉష్ణోగ్రతల మించని ప్రాంతంలో నేడు 40 డిగ్రీలు నమోదు అవుతుండడం చూస్తే రాబోవు కాలంలో మన్య ప్రాంతంలోనూ మైదాన ప్రాంతానికి దీటుగా ఎండలు మండే అవకాశం లేకపోలేదని వాతావరణ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లోకి అడుగుపెట్టిన డా.రెడ్డీస్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ హైపర్‌టెన్షన్ నిర్వహణపై అవగాహన కల్పించినందుకు కొత్తగా 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్' కొటేషన్‌ను అందుకున్నామని నేడు ప్రకటించింది. ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 17న డాక్టర్ రెడ్డీస్ రూరల్ హెల్త్‌కేర్ టీమ్, ఇండియా హైపర్‌టెన్సివ్ కంట్రోల్ ఇనిషియేటివ్ ల మార్గనిర్దేశంలో సరైన హైపర్‌టెన్షన్ ట్రీట్‌మెంట్ ప్రోటోకాల్‌ను అనుసరిస్తామని ప్రతిజ్ఞ చేసిన గ్రామీణ భారతదేశంలోని 30,813 మంది వైద్యుల సందేశాలు రాసిన అట్టముక్కలతో అతి పెద్ద గుండె ఆకారంలో ఇన్‌స్టాలేషన్‌ను నిర్మించారు. ఈ కార్యక్రమాన్ని ఇండియా హైపర్‌టెన్సివ్ కంట్రోల్ ఇనిషియేటివ్ భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ , ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశం కోసం కంట్రీ ఆఫీస్ మరియు రిజల్వ్ టు సేవ్ లైవ్స్ (సాంకేతిక భాగస్వామి)%ฃ18% ప్రోటోకాల్‌కు అనుగుణంగా రూపొందించారు. దాదాపు 200 కిలోల బరువున్న ఈ ఇన్‌స్టాలేషన్ హైదరాబాద్‌లోని బాచుపల్లిలోని డాక్టర్ రెడ్డీస్ క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు.

శ్వాస సంబంధిత లక్షణాలు పై సిప్లా 'టఫీస్' క్యాంపెయిన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ప్రపంచ ఆస్తమా అవగాహన మాసం సందర్భంగా ప్రముఖ మెడికేర్ సంస్థ అయినటువంటి సిప్లా. తన సాధారణ పేషెంట్ మరియు పబ్లిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా 'టఫీస్'ను ప్రారంభించింది. చిన్నారుల్లో, ముఖ్యంగా ఆస్తమాతో ఇబ్బంది పడుతున్న వారిలో శ్వాసకోస సంరక్షణను మెరుగుపరచడంపై మరింత అవగాహనను అందించేందుకు సిద్ధమైంది. ఆస్తమా అనేది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వ్యాధి కాదు. దాదాపు 7.9 శాతం మంది భారతీయ చిన్నారులు ప్రస్తుతం ఆస్తమాతో బాధపడుతున్నారు. దాదాపు 80 శాతం మంది చిన్నారులు ఆరేళ్ల వయసులోపే ఆస్తమా లక్షణాలను చూస్తున్నారు. వ్యాధి గురించి తగినంత అవగాహన లేకపోవడం, అపోహలు, అన్నింటికి మించి చికిత్సపై అవగాహన లేకపోవడం అసలు కారణాలు. అనేక సందర్భాల్లో ఉబ్బసం నిర్ధారణ చేయకపోవడం వల్ల చికిత్సకు కూడా దూరంగా ఉంటున్నారు. ఇవన్నీ అంతిమంగా ఆస్తమాకు దారితీస్తున్నాయి. తద్వారా ఆసుపత్రిలో చేరడం, పాఠశాల మానేయడం వంటి వాటి వల్ల వారి జీవన విధానంపై గణనీయంగా ప్రభావితం పడుతుంది. ఉబ్బసం లాంటి దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులపై ఉన్న అపోహలు మరియు దానికి సంబంధించిన చికిత్సలపై అవగాహన కలిగించేందుకు టఫీస్ కృషి చేస్తోంది.

గణపర్తి శారద నదిలో యువకుడు మృతి

విశాలాంధ్ర - మునగపాక : మండలంలో గణపర్తి సమీపంలోని శారదా నది వద్ద స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు విశాఖపట్నంకి చెందిన ధనాల మహేష్ (17) మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కసింకోట మండలం నరసింగపల్లి గ్రామంలో జరుగుతున్న వివాహానికి విశాఖపట్నం మల్కాపురం నుండి బంధువులు వచ్చారు. వీరిలో సుమారు పదిమంది యువకులు గణపర్తి వద్దగల శారదానదిలో స్నానం కోసం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వెళ్లారు.సుమారు గంట సేపు వరకు స్నానం చేశారు.వీరిలో ఒక యువకుడు లోతుగా దిగడంతో గల్లంతయ్యాడు. ఆ యువకుడ్ని రక్షించేందుకు తోటి స్నేహితులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొద్దిసేపు పోయిన తర్వాత మృతదేహం బయటకు తేలింది. మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర - చోడవరం: బ్రాహ్మణుల ఐక్యత, సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, సభ్యులు అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షులు మంథా గౌరీ శంకర్ అధ్యక్షతన చోడవరంలోని బ్రాహ్మణ భవనంలో సంఘం గౌరవ అధ్యక్షులు కందర్ప వెంకట రామేశం (రమేష్), గుంటూరు సత్యనారాయణ, కందర్ప కృష్ణమూర్తి లు సభ్యులతో ఆదివారం సమావేశమయ్యారు. సంఘం సంక్షేమానికి, భవనం నిర్మాణానికి కృషి చేసి అమరులైన కీ.శే. ఈమని నరసింహ మూర్తి, ఇచ్ఛాపురపు లక్ష్మి నరసింహంల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 50వ వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న గొటేటి సీతారామయ్య, విశ్రాంత ఉపాధ్యాయులను బ్రాహ్మణ సంఘం తరపున ఘనంగా సన్మానించారు.

గాయత్రి సేవా ట్రస్ట్, గణేష్ బ్రాహ్మణ సంఘం లను రెండింటిని కలుపుతూ శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఏర్పాటు చేసి, సభ్యులందరి ఏకాభిప్రాయంతో గౌరవ బ్రాహ్మణ పెద్దలు 9 మందితో అడ్వైజరి బోర్డ్, ముగ్గురు గౌరవ అధ్యక్షులు, 13 మందితో ఎగ్జిక్యూటివ్ కమిటీ, 9 మంది మగ, 6 గురు మహిళలతో అసోసియేట్ మెంబర్లను ఏర్పాటు చేసారు. నాలుగు కమిటీలకు కందర్ప కృష్ణ మూర్తి అధ్యక్ష కార్యదర్శ భాధ్యతలు నిర్వహించగా, ఎగ్జిక్యూటివ్ కమిటీకు అధ్యక్షులుగా పుల్రేవు శ్యాం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొమ్మనమంచి నరసింహ మూర్తిలు వ్యవహరిస్తారు. పట్టణ పురోహితులైన ధవళ శ్రీను, ఏ.పి.బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ వద్దాది నరసింహమూర్తి లకు అడ్వైజరీ కమిటీలో స్థానం కల్పించారు. ఈ కార్యక్రమంలో వింజమూరి శంకర్, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, ఏ.వి.జగన్నాథరావు, మండా శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో ఏళ్ల నాటి కల నేరవేరింది

విశాలాంధ్ర - హుకుంపేట: ఎన్నో ఏళ్ల నాటి గిరిజనుల కల నేరవేరింది. గ్రామాలకు అనుసంధానం చేసే వంతెన లేక పోవడంతో గిరిజనులు చాన్నాళ్లు నానా అవస్థలు పడ్డారు. ఆమూరు, మట్టుజోరు గ్రామాల మధ్య వారధి లేక వర్షాలు కురిసినపుడు గెడ్డ ఉధృతితో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి..ఇళ్లల్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపేవారు.. గత టీడీపీ హయాంలో వంతెన కోసం గిరిజనులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ప్రమాదకర గెడ్డపై వారధి లేక అత్యవసర పరిస్థితుల్లో ఆరు గ్రామాల గిరిజనులు పడ్డ ఇక్కట్లు వర్ణనాతీతం.. అదంతా గతం..

ప్రస్తుతం వైసిపి ప్రభుత్వ పాలనలో శివారు గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. ఇందులో భాగంగా ఆమూరు మట్టుజోరు గ్రామాల మధ్య వంతెన పనులు జోరందుకున్నాయి. దీంతో ఎన్నో ఏళ్ల నాటి గిరిజనుల కల నెర వేరింది. సుమారు ఆరు గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా ఆమూరు, మట్టుజోరు వంతెన పనులు

మంజూరైన నిధులు.. జోరుగా పనులు

మండలంలోని తీగలవలస పంచాయతీ ఆమురు గ్రామంలో వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ వంతెన తీగలవలస పంచాయతీ ఆమురు, సరళం గ్రామాలతో పాటు మట్టుజోరు పంచాయతీల పరిధిలోని కుంతుర్ల, డబ్బబంద, పెట్టుగోడలు, రంగపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల గిరిజనులకు మోక్షం లభించనుంది. జరుగుతున్న పనులను పై స్థాయి అధికారులు ఇచ్చిన గడవులోగా త్వరితగతిన పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

గెడ్డపై వంతెన నిర్మించకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. గత టీడీపీ పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇందులో భాగంగా గెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఏళ్లనాటి కల నెరవేరింది. జగనన్న ప్రభుత్వానికి స్థానిక ఆదివాసులు రుణపడి ఉంటాం.

– కొర్రి చిట్టిబాబు, వార్డు సభ్యుడు,
ఆమూరు గ్రామం, తీగల వలసి పంచాయతీ, హుకుంపేట మండలం

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర - చింతపల్లి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని ఆ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి వీరన్న పడాల్ (బాబులు) అధ్యక్షతన స్థానిక పాత బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, సాంకేతిక రంగాలను విస్తరించడంతోపాటు, 18సం నిండిన వారికి ఓటు హక్క కల్పించడం, అంతర్జాతీయ రోడ్డు రవాణా మార్గం, టెక్నాలజీ రంగాలు అభివృద్ధితో తన మార్కు పరిపాలనను రాజీవ్ గాంధీ చూపారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఆదివాసి విభాగం రాష్ట్ర కో కన్వీనర్ వంతల గోపీనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు లకే రమణ, చౌడుపల్లి మాజీ సర్పంచ్ సాగిన కృష్ణపడాల్, సీనియర్ నాయకులు మర్రి గురుమూర్తి, మొట్టడం బాలరాజు, గెమ్మెలి సింహాద్రి, గెమ్మెలి రామచంద్రరావు, శెట్టి ప్రసాద్, గెమ్మెలి సింహాచలం, గెమ్మెలి ప్రసాద్, కొర్ర మోహన్, కొర్ర చిన్నారావు, వంతల బాబురావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకులోయ: అరకులోయలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆదివాసి చైర్పర్సన్ పాచిపెంట శాంతకుమారి మాట్లాడుతూ భావి భారత ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిముడు ఆదినారాయణ, మోహన్ రావు, నాగేశ్వరరావు, పద్మ రాధ లక్ష్మి, భగత్రం, గంగాధర్ సుబ్బారావు, జగన్నాథం రఘురాం, అద్దు, కాంతిరాజ్ కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు సుజాత నగర్ పరిధిలోని, వేంకటాద్రి నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు ఆదివారం శంకుస్థాపన చేశారు. అక్కడ సామాజిక భవనం నిర్మాణానికి జీవీఎంసీ నుండి 18 లక్షలు నిధులు మంజూరు చేయించిన కార్పొరేటర్ పనులు వేగంగా పూర్తి చేయాలని భవన నిర్మాణదారులకు సూచించారు. ఈ సందర్భంగా వసంత శంకర్రావు మాట్లాడుతూ తన వార్డును అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రదమ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విద్యాసాగర్, కార్యదర్శి రాజేశ్వరి, నాయుకులు సూరిబాబు, క్రుష్ణవేణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ సంప్రోక్షణకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర - రంపచోడవరం: రంపచోడవరంలో టీటీడీ నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జేఈవో వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి సోమవారం జరగనున్న మహా సంప్రోక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ భక్తులందరికీ దర్శనం చేసుకోవడానికి వీలుగా క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులకు మజ్జిగ, తాగు నీరు, ప్రసాదాలు విరివిగా అందించడంతో పాటు ఎక్కువ సంఖ్యలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, పిఆర్‌ఓ డాక్టర్ రవి, డిప్యూటీ ఈవో వెంకటయ్య, విజీఓ మనోహర్, ఈఈ సుధాకర్, డిప్యూటీ ఈఈ ఆనంద రామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

విశాలాంధ్ర - చింతపల్లి: తెలుగు వాడి ఆత్మగౌరవానికి ప్రతీక విశ్వవిఖ్యాత నటసార్వ భౌముడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి అన్నారు. తెదేపా వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను పురస్కరించుకుని అల్లూరి జిల్లా పాడేరు శాసనసభ నియోజక వర్గ జి.కె వీధి మండలంలో ఆదివారం స్థానిక టీఎన్ఎస్ఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ పాలన అంటే ఒక్క ధర్మ పాలనని, నాడు ఆంధ్రుల ఆత్మ గౌరవం కోసం ఢిల్లిని సైతం వణికించిన మహా మనిషి ఎన్టీఆర్ అన్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి మహేష్, జి.కె వీధి మండల మాజీ అధ్యక్షులు బలరాం, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి కళ్యాణి, తెలుగు రైతు అధ్యక్షులు వండలం బాలయ్య, మత్స్యరాస రూప, టి.ఎన్.ఎస్.ఎఫ్ జి.కె వీధి మండల అధ్యక్షులు గుంట బుజ్జిబాబు, టి.ఎన్.ఎస్.ఎఫ్ కార్యదర్శి మేత్రి, తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు మనుగురి మరియమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామ్రేడ్ నాగేశ్వరరావుకు విప్లవ జోహార్లు

విశాలాంధ్ర - చోడవరం: భారత కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత, రైతు సంఘం నాయకులు కామ్రేడ్ కొల్లి నాగేశ్వరావు మూడవ వర్ధంతి సందర్భంగా జిల్లా సమితి సభ్యుడు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో అనుబంధ ప్రజా సంఘాల నాయకులు ఆదివారం విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి రైతులు హక్కుల గురించి ఎనలేని కృషి చేసి, రైతు ప్రజా పోరాటంలోనే ఆయన జీవితం అంతా దారపోసారాన్నారు. కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం ద్వారా రైతులకు హక్కులు కల్పించడం కోసం పోరాటం చేస్తూ కన్నుమూసిన సందర్భంలో రైతు సంఘం నాయకులు ఆయన చేసిన పోరాటాలు, ఆశయాలను నెరవేర్చాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారపూడి నాగేశ్వర రావు, మేడిశెట్టి శ్రీనివాసరావు, బొడ్డు చిన్నారావు, మరియు రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యర్థాలతో దుర్గంధం: ప్రజల ఇక్కట్లు



విశాలాంధ్ర-గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో బోయినవారి చెరువు సమీపంలో వివిధ రకాల వ్యర్థాలు రోడ్డుని ఆనుకొని పడి వేయడంతో ఆ రహదారి గుండా ప్రయా ణించే ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఎల్ పురంలో సుమారుగా 10 చికెన్ సెంటర్లు ఉన్నాయి. అయితే వాటికి సంబంధించిన వ్యర్థాలు అన్నింటిని ఉదయం సాయంత్రం సమయ ంలో చెరువును ఆనుకొని గట్ల మీద పడ వేయడంతో కుక్కలు, పందులు ఆ ప్రాంతంలో బీభత్సం సృష్టిస్తు న్నాయి. ఆ దారి గుండా ప్రయాణించే ప్రయాణికుల వాహనాలు వెంట గ్రామ సింహాలు పరిగెత్తుతూ ఉండ డంతో ఎక్కడ కరుస్తాయో అని ఆందోళనతో మరింత స్పీడ్‌గా వెళ్లడంతో ప్రమాదాలు కూడా సంభవిస్తున్నా యి. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకొని బోయినవారి చెరువు సమీపంలో రోడ్డు పక్క న వ్యర్థాలను వెయ్యకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర - చోడవరం: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ మీట్‌ను చోడవరంలో శ్రీ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం ప్రారంభించారు. ఈ మీట్‌లో చెస్, షటిల్, బ్యాడ్మింటన్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రత్యేక బహుమతులతో పాటు, పోటీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.ఎస్.కుమార్, గవర్నర్ వరహాల్ రావు, ఇంటర్నేషనల్ డైరెక్టర్ శ్రీను, కేబినెట్ కార్యదర్శి ఎస్.వి.మధు, ట్రేజరెర్ స్వామి, వైస్ గవర్నర్ నరసింగరావు రావు, అన్ని క్లబ్స్ మెంబర్స్ పాల్గొన్నారు.

ఇంధన రంగంలో అపార అవకాశాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఇంధన రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని, ఆవిష్కరణలతో యువత దాన్ని అందిపుచ్చుకోవాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసిఎల్) రీసెర్చ్ డెవలప్మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రామ్ కుమార్ అన్నారు. ఏయూ సెనేట్ మందిరంలో నిర్వహించిన స్టార్టప్ ఫండ్ ప్రి-పిచ్చింగ్ సెషన్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఇంధన రంగంలో యువ ఆవిష్కరణలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. యువత ఆలోచనలతో వస్తే వారికి అవసరమైన సాంకేతిక ఆర్థిక సహకారాన్ని తాము అందిస్తామన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు పరిష్కారాలను చూపాలని సూచించారు. ఐపిఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు చేయడానికి అవసరమైన ఆర్థిక వనరులను అందించే సంస్థలు ఏయూకు రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐఓసిఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోగుండమ్మ అమ్మవారి పండగ

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఖండివరం, కోణాం గ్రామాలలో ఆదివారం బోగుండమ్మా అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పివిజి కుమార్, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: టీడీపీ పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని కిటుముల పంచాయతీ పనసమానుబయలు గ్రామంలో ఆ గ్రామ పంచాయతీ పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని నాయకులు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు, సేవ మిత్రలు తమ పనితనం మెరుగుపరచుకోవడంతోపాటు 2024లో పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల స్థితిగతులను మార్చేది వైసీపీ ప్రభుత్వమే



విశాలాంధ్ర - కొయ్యూరు: పేద ప్రజలు గిరిజనుల స్థితిగతులను మార్చేది కేవలం వైసీపీ ప్రభుత్వమేనని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని అత్యంత మారుమూల యు.చీడిపాలెం పంచాయతీ పరిధి సంగంవలస, నక్కలమెట్ట, గంగవరం, యు.చీడిపాలెం గ్రామాల్లో నిర్వహించిన గడప - గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించారు. ప్రధానంగా ఆయా గ్రామాలకు డ్రైనేజీ, సిసి రోడ్లు రహదారి నిర్మాణాలకు సంబంధించి తమ సమస్యలను అక్కడి గిరిజనులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే గిరిజనులకు హామీ ఇచ్చారు. పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్ దడాల రమేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమేష్, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలమ్మ, స్థానిక సర్పంచ్ దడాల రమేష్, ఎంపీటీసీ మాధవరావు, పిఏసిఎస్ చైర్మన్ సూరిబాబు, ఏఎంసీ చైర్ పర్సన్ రాజులమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు బాబులు, ఎంపీటీసీ మల్లేశ్వరి, వైసీపీ సీనియర్ నేత సావిత్రి పాల్గొన్నారు.

2 వేల నోట్ల రద్దు అనాలోచిత నిర్ణయం

రాష్ట్ర కాంగ్రెస్

ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల

విశాలాంధ్ర - పెందుర్తి: 2 వేల నోట్లు చలామణి నుండి వెనక్కు తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్ ఆకస్మికంగా ప్రకటించడాన్ని అనాలోచిత చర్యగా ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకట్రావు ఆక్షేపించారు. నగదు ఆధారిత లావాదేవీలు జరిపే వ్యక్తులు, సంస్థల వద్ద ఈ నోట్లు పెద్ద సంఖ్యలో ఉంటాయని, దేశంలో అసంఘటిక ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికీ వేతనాలు చెల్లింపులు కోసం నగదు పైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. వైద్య, ఫార్మసీ, రియల్ ఎస్టేట్ ఆస్తికి సంబంధించిన లావాదేవీలు జరిపేవారు కూడా తమ వ్యాపారాన్ని నగదు రూపంలో నిర్వహిస్తుంటారని, రోజు వారి వ్యాపారంలో 50శాతం నగదు పైనే ఆధారపడతారని తెలిపారు. నిర్మాణ రంగంలోనూ ఇదే పరిస్థితి అని వెల్లడించారు. కర్ణాటక ఎన్నికల్లో ఘోర పరాజయం పొందిన కొద్ది రోజుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నారన్న విషయం వాస్తవంగా గుర్తించాలన్నారు. మొదట డిమోనిటైజేషన్‌తో ఆర్థిక వ్యవస్థ కోలుకోని విధంగా గాయం చేశారని, దీనివల్ల అసంఘటిత రంగం,ఎమ్ ఎస్ ఎమ్ ఈ సెక్టార్ కుదేలైందని విమర్శించారు.

జనావాసాల మధ్య మరుగుదొడ్ల ఏర్పాటు తగదు

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలో గల ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్ర గుహలకు కూత వేటు దూరంలో ఉన్న గేటు వలస అనే గ్రామంలో జనావాసాల మధ్య మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. గతంలో పంచాయతీ కార్యాలయం నిర్వహించిన భవనం ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో దానిని మరమ్మతులు చేపట్టి మరుగుదొడ్లుగా మార్చేందుకు స్థానిక సర్పంచ్ చర్యలు చేపట్టారు. అయితే ఈ భవనం పాఠశాల జనావాసాలకు అతి చేరువలో ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. జనావాసాలకు దూరంగా నిర్మించుకోవాలని గ్రామం మధ్యలో ఇటువంటివి ఏర్పాటు చేయడం తగదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి దీని నిర్మాణం ఆపాలని లేకుంటే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

మాడుగుల నుండి బోయపాడుకి తారు రోడ్డు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం నుండి చీడికాడ మండలం బోయపాడు గ్రామం వరకు నూతనంగా కోటి 90 లక్షల రూపాయలతో తారు రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టినట్లు మాడుగుల ఎంపీపీ వేమవరపు రామ ధర్మజ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కృషితో నిధులు మంజూరు అయ్యాయని ఈ నిధులతో గతంలో ఉన్న రోడ్డుకు మరో నాలుగు అడుగులు పెంచి తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చీడికాడ ఎంపీపీ, మాడుగుల సర్పంచ్ కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గా మాత విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని పెద్దమట్ట పల్లి గ్రామంలో అహోబిలం నరసింహ సేవా సమితి ఆర్థిక సహాయంతో విగ్రహ దాతలు కీర్తిశేషులు కంచర్ల వెంకట రామయ్య, అన్నపూర్ణమ్మ, కంచర్ల అను రాధదేవి, సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు దేవాలయ కమిటీ సమక్షంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఆదివారం వేద పండితులు పురుషోత్తమాచార్యులు మంత్రోచ్ఛరణలతో భక్తజన సందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. అహోబిలం నరసింహ సేవా సమితి భద్రాచలం పూజ శ్రీ చైతన్య స్వామి సబ్ డివిజన్ ప్రచార హక్కు కరిసిన శ్రీనివాసరావు, సహ కన్వీనర్ బి.ప్రమీల, ధర్మ ప్రచార హక్కు ముత్యాల రామకృష్ణయ్య, వడ్డేగూడెం గ్రామ కన్వీనర్ ముత్యాల సత్యనారాయణ, గ్రామ కన్వీనర్ ముల్లా రమాదేవి తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు మహిళా మాతృమూర్తులు భక్తులు పెద్దలు పిల్లలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గిరిజనుల ప్రాణాలంటే వైసీపీ ప్రభుత్వానికి ఇంత చిన్న చూపా

చింతపల్లిలో విష జ్వరాల శీర్షికకు స్పందన

విశాలాంధ్ర - చింతపల్లి: గిరిజనుల ప్రాణాలు అంటే వైకాపా ప్రభుత్వానికి ఎంత చిన్న చూపా అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెదేపా మాజీ మంత్రి మచ్చరాస మణికుమారి అన్నారు ఆదివారం విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన చింతపల్లిలో విష జ్వరాలు అనే కథనానికి స్పందించారు. ఆదివారం జీకే వీధి వచ్చిన ఆమె చింతపల్లిలో ఆమెను కలిసిన విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు అవుతున్నప్పటికి మన్యప్రాంత ఆసుపత్రులలో నిపుణులైన వైద్యులను నియమిం చడంలో, గిరిజనులకు సకాలంలో సరైన వైద్యం అందించడంలోనూ, త్రాగు నీటి సదుపాయాల కల్పన లో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం ఉన్నప్పుడు ఉన్న కొళాయిలే గిరిజన గ్రామాలల్లో ఉన్నాయి తప్పితే ఒక్క కొత్త కొళాయి ఏర్పాటుచేసి నీళ్లు ఇచ్చిన దాఖలాలు లేదన్నారు. చింతపల్లి జికే వీధి మండలాలకు పెద్ద దిక్కయిన సామాజిక ఆసుపత్రిలోనే నిపుణులైన వైద్యులు లేక మరణాలు సంభవిస్తున్నాయి అంటే, విష జ్వరాలు విజృంభిస్తున్నాయి అంటే వైకాపా ప్రభుత్వంలో వైద్యశాక తీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అన్నారు.

మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంది అంటే మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే చింతపల్లి రామాలయం వీదికి చెందిన ఉగ్రంగి దనెశ్వరి అనారోగ్యం తో మృతి చెందిన్నారు ఇప్పటికైనా చింతపల్లి గ్రామస్తుల త్రాగునీటి సమస్యతో పాటు, వైద్య శాఖ సమ స్యను కూడా ప్రభుత్వం పరిగనణలోకి తీసుకుని పరిస్కారం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

సర్పంచ్ సొంత నిధులతో రహదారి మరమ్మతులు

విశాలాంధ్ర - కొయ్యూరు: భారీ గుంతలతో అధ్వానంగా తయారైన రహదారిని సర్పంచ్ భర్త తన సొంత నిధులతో మరమ్మతులు చేయించడంతో పంచాయతీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని నడింపాలెం పంచాయతీ కంపరేగుల గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారి రాకపోకలు సాగించేందుకు పంచాయతీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. దీంతో అత్యవసర సమయాల్లో వాహన రాకపోకలకు 108 అంబులెన్స్ వచ్చేందుకు సైతం ఇబ్బందులు పడుతుండడంతో పంచాయతీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై స్పందించిన సర్పంచ్ వెంకటలక్ష్మి భర్త రాము తన సొంత నిధులతో రహదారి పొడవునా ఏర్పడ్డ గోతులలో గ్రావెల్ నింపి మరమ్మతులు చేయించారు. రహదారి మరమ్మత్తు పనులు పూర్తయి ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తొలగడంతో పంచాయతీ వాసులు సర్పంచ్ వెంకటలక్ష్మి ఆమె భర్త రాములను అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కేజేపురం మోదకొండమ్మ వారికి వెండి పాదాలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండలంలో రెండో మేజర్ పంచాయతీ కేజేపురం గ్రామదేవత శ్రీ మోదకొండమ్మ వారికి ఆదివారం ఒక భక్తుడు రెండు లక్షల రూపాయలు విలువ చేసే రెండున్నర కిలోల వెండి పాదాలను సమర్పించారు. వీటిని గ్రామానికి చెందిన ఎల్లపు వెంకటరమణ కుమారుడు న్యూజిలాండ్ దేశంలో నివాసం ఉంటున్న త్రినాధ మౌనిక దంపతులు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ పెద్దలు ఆదారి కన్నారావు, ఎల్లపు శ్రీనివాసరావు, జామి రమణబాబు, ఆదారి సన్యాసినాయుడు, బీశెట్టి జగ్గప్పారావు, బొడ్డేడ సురేష్ పాల్గొన్నారు.